ఎండీయూ ఆపరేటర్ల పరేషాన్


ఇంటింటికీ వచ్చి రేషన్ అందజేస్తున్న ఎండీయూ వాహనం (ఫైల్)


ఎండీయూ వాహనాలను రద్దు చేయడంతో నినాదాలు చేస్తున్న ఆపరేటర్లు

- నిలిచిన సేవలు.. రోడ్డున పడ్డ బతుకులు
- 2027 వరకు గడువున్నా రద్దు చేసిన కూటమి సర్కార్
- డోర్ డెలివరీ రద్దుతో వృద్ధులు, వికలాంగుల అవస్థలు

దెందులూరు: రేషన్ వాహనాలను తీసేయడంతో ఎన్‌డీయూ ఆపరేటర్లు రోడ్డున పడ్డారు. వాహనం కోసం తీసుకున్న అప్పు ఎలా చెల్లించాలని ఆపరేటర్లు నెత్తీ నోరూ బాదుకుంటున్నారు. గత ప్రభుత్వం మీద కక్షతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సేవలు ఉండకూడదన్న దురుద్దేశ్యంతో పేదల కడుపు కొట్టడంతో వారి బతుకు వీధిన పడింది. ఇక ఎండీయూ ఆపరేటర్ల కుటుంబాలు పడుతున్న బాధలు అన్నీ ఇన్నీ కావు. ఓ వైపు వాయిదాలు చెల్లించకపోతే వాహనాలను తీసుకెళతారు. మరో వైపు కుటుంబాన్ని పోషించాలంటే మరో దారి కనిపించడం లేదు. ఏం చేయాలో దిక్కు తోచక ఆత్మహత్యలే శరణ్యమని ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డును పడ్డ ఆపరేటర్లు

ఆపరేటర్లు మిగిలిన అప్పు చెల్లించాలి. మూడు వాయిదాలు చెల్లించుకుంటే వాహనాన్ని సీజ్ చేస్తారు. ఉపాధి కోల్పోయిన వాహన నిర్వాహకులు వాయిదాలు ఎలా కట్టాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిన్న మొన్నటి దాకా వాహనంలో రేషన్ సరుకులను పంపిణీ చేస్తున్న కూటమి ప్రభుత్వం ఇకపై వాహనాలు వద్దని ఆయా డీలర్ల వద్ద సరుకుల పంపిణీ చేపడుతోంది. దీంతో ఇన్నాళ్లూ దీన్నే నమ్ముకున్న ఆపరేటర్ల బతుకులు అగమ్యగోచరంలో పడ్డాయి.

ఇప్పటి వరకు వాహనాల ద్వారా సరఫరా

రేషన్ దుకాణ పరిధిలోని కార్డుదారులకు ఎండీయూ వాహనాల ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి రేషన్ పంపిణీ చేసేవారు. పీడీఎస్ రైసుకు సంబంధించి ఐసీడీఎస్, అంగన్‌వాడీ స్కూల్స్, హాస్టళ్లకు వాహనాలతో సరఫరా చేసేవారు. రేషన్ దుకాణం ఉన్న గ్రామానికి 7, 8 కిలోమీటర్ల దూరంలో ఉండే ఆవాస గ్రామాల్లోని కార్డుదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ వాహనాల ద్వారా సరుకులు ప్రతి నెలా అటవీ సమీప గ్రామాలు వ్యవసాయ పొలాల వద్ద నివాసాలు ఉండే వారికి ఎంతో సౌకర్యంగా ఉండేది.

నియోజకవర్గంలో వాహనాల వివరాలు

మండలం	వాహనాలు
దెందులూరు	14
పెదవేగి	17
పెదపాడు	13
ఏలూరు రూరల్	9

ఆపరేటర్ల పరిస్థితి ఏమిటి?

రేషన్ షాపుల పరిధిలో ఆపరేటర్లకు ఎంపిక చేశారు. యూనిట్ ఖరీదు రూ.5.81 లక్షలు అందులో సామగ్రి కోసం రూ.9,200గా నిర్ణయించారు. వాహనాలకు బ్యాంక్ ఆఫ్ బరోడా ద్వారా రుణాలు అందించారు. ఈ వ్యవహారాలను ఏపీ సివిల్ సప్లై కార్పొరేషన్ లిమిటెడ్ చేపట్టింది. ఈ సందర్భంగా ఆపరేటర్లు 10 శాతం కంట్రిబ్యూషన్, 90 శాతం లోన్‌గా ఈ ప్రాజెక్టు 2021 ఫిబ్రవరి నుంచి 2027 జనవరి వరకు అగ్రిమెంట్ చేసుకున్నారు. ఆపరేటర్‌కు నెల జీతం రూ.21 వేలుగా నిర్ణయించారు. ఇందులో బ్యాంకుకు ప్రభుత్వం ద్వారా వాయిదాకు రూ.3000 చెల్లించాలి. వావహనం పెట్రోల్‌కు రూ.3000, హెల్పర్‌కు రూ.5000 పోగా నెలకు ఆపరేటరుకు రూ.10 వేలు మిగిలేది.

కాంట్రాక్ట్ ఎందుకు రద్దు చేశారు

ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరఫరా కాంట్రాక్టు 2027 వరకు సివిల్ సప్లై కార్పొరేషన్‌తో గడువు ఉంది. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సేవలు ఉండకూడదనే ఉద్దేశంతోనే గడువు ఇంకా ఉన్నప్పటికీ అర్థాంతరంగా డోర్ డెలివరీ విధానాన్ని కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. ఈ రద్దు నిర్ణయంతో పేదలకు తీరని నష్టం జరగడమే కాకుండా డ్రైవర్లు, హెల్పర్లు, వారిపై ఆధారపడ్డ కుటుంబ సభ్యులు జీవనం కోల్పోయారు. వాహనాలను ఫైనాన్సియర్ తీసుకెళ్లిపోయే పరిస్థితి నెలకొంది.

“ గడువు ఉన్నా రద్దు చేశారు


2027 వరకు వాహనదారులతో డోర్ డెలివరీ కాంట్రాక్టు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఎందుకు రద్దు చేయాల్సి వచ్చింది. కూటమి ప్రభుత్వం అర్థాంతర నిర్ణయంతో పేదలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. వృద్ధులు, అనారోగ్యంతో బాధపడేవారు రేషన్ తెచ్చుకోలేక అనేక అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం ఈ నిర్ణయంపై పునరాలోచించాలి. ఏ ప్రభుత్వమైనా పేదలకు మంచి చేయాలి.

– అప్పన పద్మావతి, మండల వైస్ ఎంపీపీ పెదపాడు

దిక్కుతోచని స్థితిలో డీలర్లు, హెల్పర్లు


కూటమి ప్రభుత్వం వాహనాల డోర్ డెలివరీ విధానాన్ని రద్దు చేయడంతో దానిపై ఆధారపడిన ఆపరేటర్లు, హెల్పర్లు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. కూటమి ప్రభుత్వ నిర్ణయం వలన వాహనాల డ్రైవర్లు, హెల్పర్లు శాశ్వతంగా ఉపాధి కోల్పోయారు. రోడ్డున పడ్డ వారిపై ఆధారపడిన కుటుంబాల పరిస్థితి ఏమిటని ఆపరేటర్లు, హెల్పర్లు వాపోతున్నారు. వాహనాల బాకీ చెల్లించాలని ఇప్పటికీ అప్పు ఇచ్చిన వారు వెంటాడుతున్నారు.

– సొంగ ప్రమీల, ఎంపీటీసీ

బాలికల భద్రతే కిశోర వికాసం లక్ష్యం


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సీహెచ్ పద్మావతీదేవి

భీమడోలు: బాలికలు, మహిళల భద్రత కిశోర వికాసం లక్ష్యమని ఎంపీడీవో సీహెచ్ పద్మావతీదేవి అన్నారు. గుండుగొలను నంబర్ 23 అంగన్‌వాడీ కేంద్రం వద్ద మంగళవారం కిశోర వికాసం 2.0 ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సూపర్‌వైజర్ కవిత అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీవో సీహెచ్ పద్మావతీదేవి మాట్లాడుతూ కిశోర బాలికలు, మహిళల ఉజ్వల భవిష్యత్తుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. బాలికలు చదువుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని, తద్వారా కుటుంబానికి అండగా నిలుస్తారన్నారు. తల్లిదండ్రులు, విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండి పుస్తక పఠనంపై దృషి సారించాలన్నారు. సూపర్‌వైజర్ కవిత మాట్లాడుతూ కిశోర బాలికలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, పోషిక విలువలు గల ఆహారాన్ని తీసుకోవాలన్నారు. మే 2వ తేదీ నుంచి జూన్ 10వ తేదీ వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోర బాలికలకు పలు అవగాహన కార్యక్రమాలను నిర్వహించామన్నారు. మాజీ ఎంపీపీ కొండబాబు మాట్లాడుతూ పిల్లలు తల్లిదండ్రులు గౌరవించాలని, బాధ్యతగా చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీటీవో ప్రతినిధి సునీత, గ్రామ కార్యదర్శి కేవీ తనూజ, మహిళా కానిస్టేబుల్ అరుణ, వెల్ఫేర్ అసిస్టెంట్ యోగేష్, గొర్రెల పవన్, బోడ సంసోన్, కె.మాణిక్యాలరావు, బి.రాజమణి, ఈశ్వరమ్మ, సుందరి, సత్యవేణి, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి


గర్భిణులను పరీక్షిస్తున్న వైద్యాధికారిణి

గణపవరం: గర్భిణులు వైద్యుల సూచనలు పాటిస్తూ పౌష్టికాహారం తీసుకోవాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో పురుడు పోసుకోవడం ద్వారా అనేక ప్రయోజనాలు పొందొచ్చని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి పి.కిరణ్మయి అన్నారు. మంగళవారం గణపవరం పీహెచ్‌సీలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గణపవరంలోని నాలుగు గ్రామ సచివాలయాల పరిధిలో ఉన్న 78 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గర్భిణులకు పలు సూచనలు చేశారు. ఐరన్ ఎక్కువగా ఉండే ఆహారం, ఆకు కూరలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. ప్రతి నెలా 9, 10 తేదీల్లో పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పీహెచ్‌సీ సీహెచ్‌వో జాలాది విల్సన్ మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో రక్త, యూరిన్ పరీక్షలు ఉచితంగా చేస్తున్నామని, అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని వినియోగించుకోవాలన్నారు. సత్యవతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉంగుటూరులో సేవా కార్యక్రమాలు


కేక్ కట్ చేస్తున్న వట్టి వసంత్ అభిమానులు

ఉంగుటూరు: మాజీ మంత్రి వట్టి వసంత్‌కుమార్ అందించిన సేవలు మరువలేనివని పలువురు వక్తలు అన్నారు. మంగళవారం దివంగత వసంత్‌కుమార్ జయంతిని ఉంగుటూరులో నిర్వహించారు. వసంత్ యువసేన అధ్యక్షుడు ముత్యాల బాలాజీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆప్కో రాష్ట్ర మాజీ డైరెక్టర్ దొంతంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ వసంత్‌కుమార్ మంచి మనిషి అని, కార్యదీక్షాపరుడన్నారు. యువసేన సభ్యులు ఆయన అభిమానులు 38 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో వసంత్ యువసేన అధ్యక్షుడు ముత్యాల బాలాజీ, నాయకులు పెదిరెడ్డి సుబ్బారావు, పెనుగొండ సూర్యచంద్రరావు, పాంద్రాకుల శ్రీనివాసరావు, చల్లా సాయి, సాధనాల వీర్రాజు, చిట్టూరి హరిబాబు, బేతాళం శ్రీకాంత్, పాల్గొన్నారు.


సీహెచ్‌సీలో రోగులకు పళ్లు, పౌష్టికాహారాన్ని అందజేస్తున్న పలు సంఘాల ప్రతినిధులు

రోగులకు పౌష్టికాహారం పంపిణీ

భీమడోలు: ఉంగుటూరు నియోజకవర్గ అభివృద్ధికి దివంగత నేత వట్టి వసంతకుమార్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. వసంత కుమార్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం అభిమానులు, యూత్ అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో పూళ్ల, భీమడోలు గ్రామాల్లో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఆసుపత్రుల్లోని గర్భిణులు, రోగులకు పౌష్టికాహారం, రొట్టెలు, పళ్లు, ఓఆర్‌ఎస్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దాయం సుజాత, వైద్యాధికారిణి డాక్టర్ రేష్మి, వర్ధినీడి సత్యసాయి, గుడివాడ సీతారామాంజనేయులు, బాబ్జి, లక్ష్మణ్, ఎం.గోపాలకృష్ణ, నాదు బాలాజీ, వాసు, రామ్మూర్తి, సతీష్, నాగేంద్ర, అజయ్, మణి, తదితరులు పాల్గొన్నారు.

ఎండీఎం బియ్యాన్ని పాఠశాలలకు తరలించాలి


ఎంఎల్‌ఎస్ పాయింట్‌ను తనిఖీ చేస్తున్న జేసీ పి.ధాత్రిరెడ్డి

జంగారెడ్డిగూడెం: పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి సంబంధించి బియ్యాన్ని ఈ నెల 11వ తేదీ బుధవారం నాటికి అన్ని పాఠశాలలకు తరలించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి ఆదేశించారు. మంగళవారం పట్టణంలో గల ఎంఎల్‌ఎస్ పాయింట్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలకు పంపే బియ్యాన్ని ఆమె పరిశీలించారు. అలాగే గోడౌన్‌లో ఉన్న స్టాక్‌ను, రికార్డులను పరిశీలించారు. అనంతరం పట్టణంలో గల పద్మ థియేటర్ సమీపంలో ఉన్న 37వ రేషన్ షాపును ఆమె తనిఖీ చేశారు. అలాగే దివ్యాంగులకు, వృద్ధులకు త్వరితగతిన ఇంటికే రేషన్ సరఫరా చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో ఎంవీ రమణ, తహసీల్దార్ కె.స్లీవజోజి, సీఎస్ జిల్లా మేనేజర్ శివమూర్తి, సీఎస్‌డీటీ సీహెచ్ వెంకటేశ్వరరావు, డీటీ రమేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రీసర్వే పనులు వేగవంతం

దెందులూరు: మండలంలో పైలెట్ ప్రాజెక్టు గ్రామాలైన రామారావుగూడెం, ముప్పవరం గ్రామాల్లో రీసర్వే పనులు వేగవంతంగా నిర్వహిస్తున్నామని తహసీల్దార్ బి.సుమతి అన్నారు. మంగళవారం ఆమె రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ రవిచంద్రతో కలిసి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామారావుగూడెం గ్రామంలో 69 ఎకరాలు, ముప్పవరం గ్రామంలో 397 ఎకరాల్లో రీసర్వే పనులు సర్వేయర్లు చేస్తున్నారన్నారు. ప్రాథమిక దశలో భూమిపై హక్కుదారుడు విస్తీర్ణాన్ని నమోదు చేసి రికార్డుల్లో పొందు పరిచే కార్యక్రమం దాదాపు పూర్తికావచ్చిందన్నారు. రైతులు రెవెన్యూ సిబ్బందికి పూర్తి స్థాయిలో సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ హేమమాలిని, వీఆర్‌వోలు, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ తరగతులు


శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న ఏసీడీపీఓ

దెందులూరు: బాల్య వివాహాల వలన కలిగే నష్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సీడీపీఓ సునీల్ రాజశేఖర్ అన్నారు. మండలంలోని దోసపాడులో గ్రామ సర్పంచ్ గోరింక ఏసుమణి అధ్యక్షతన సెక్టార్ సూపర్‌వైజర్ కె.శ్రీదేవి ఆధ్వర్యంలో కిశోరి బాల వికాసం వేసవి శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కిశోర బాలికలు నేర్చుకున్న అంశాల గురించి క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. క్రమం తప్పకుండా నేర్చుకున్న కిశోర బాలికలను ఏసీడీపీఓ రాజశేఖర్, కె.శ్రీదేవి, సర్పంచ్ జి.ఏసుమణి సత్కరించారు.

102 పింఛన్ల మంజూరు

దెందులూరు: మండలానికి నూతనంగా 102 పింఛన్లు మంజూరయ్యాయని దెందులూరు ఎంపీడీవో కె.శ్రీదేవి తెలిపారు. మంగళవారం ఆమె తన కార్యాలయంలో మాట్లాడుతూ ప్రజా ప్రతినిధుల కృషితో మండలానికి ఈ పింఛన్లు మంజూరైనట్లు తెలిపారు.

రైతులు నిపుణుల సూచనలు పాటించాలి

గణపవరం: రైతులు వ్యవసాయ నిపుణులు, శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటిస్తూ తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. మంగళవారం గణపవరం మండలం మొయ్యేరు గ్రామ రైతుసేవా కేంద్రంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ దుళ్ల కుటుంబరావు, నీటి సంఘం అధ్యక్షుడు దాట్ల రంగరాజు, తోట శ్రీను, ఇందుకూరి రామకృష్ణంరాజు, కొయ్యా సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

కొత్త ప్లాంటేషన్లకు అనుమతి ఇవ్వాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో వన సంరక్షణ సమితుల్లో పనిచేస్తున్న పేదల సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కొత్త ప్లాంటేషన్లకు అనుమతులు ఇవ్వాలని కోరుతూ ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అటవి ప్రాంత పేదలు వన సంరక్షణ సమితుల సమైక్య జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా రేంజర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ జిల్లాలోని అటవీ ప్రాంత భూముల్లో పేదలు, దళితులు గత 25 ఏళ్ల నుంచి సాగు చేస్తూ జామాయిలు, వెదురు వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారని తెలిపారు. జామాయిల్ పంటకు నిబంధనల ప్రకారం ఐదు నుంచి ఏడేళ్ల మధ్య ఉన్న తోటలకు కటింగ్‌కు ఆర్డర్ ఇవ్వాలన్నారు. అటవీ ప్రాంతంలో పేదలకు వ్యవసాయం పనులు లేని నేపథ్యంలో వన సంరక్షణ సమితులు పేదలకు అండగా ఉంటున్నాయని, వాటిల్లో వివిధ రకాల పంటలు వేసుకుని భూమిని సాగు చేస్తున్నారని వివరించారు. అటవీ ప్రాంత పేదలు, వన సంరక్షణ సమితుల్లో పనిచేస్తున్న కూలీలకు వేతనాలు ఇవ్వాలని, కొత్త వీఎస్ఎస్ ప్లాంటేషన్లు ఇవ్వాలని, కటింగ్ వచ్చిన ప్లాంటేషన్లు కటింగ్ అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏలూరు రేంజర్ కుమార్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా వీఎస్ఎస్ సభ్యులు జయరాజు, అంజయ్య, ప్రసాద్, కనకరాజు, కృపా, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బాబురావు, దాసు, తోచిలక రాయుడుపాలెం, కొత్తపల్లి, ఉంగుటూరు, గొల్లగూడెం గ్రామాల వీఎస్ఎస్ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల పాలిట ఉరితాళ్లు.. స్మార్ట్ మీటర్లు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.లింగరాజు, నాయకులు

భీమడోలు: ప్రజల పాలిట ఉరితాళ్లుగా మారే విద్యుత్ స్మార్ట్ మీటర్లను తిరస్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.లింగరాజు పిలుపు నిచ్చారు. భీమడోలులోని సీపీఎం కార్యాలయంలో మంగళవారం మండల సమావేశాన్ని నిర్వహించారు. మా ఇంటికి స్మార్ట్ మీటర్లు వద్దు, విద్యుత్ చార్జీలు తగ్గించాలన్న పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ సమావేశానికి నాయకులు కట్టా భాస్కరరావు అధ్యక్షత వహించారు. ఆర్.లింగరాజు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం నిరంకుశ చర్యల్లో భాగంగా ఆదానీకి అనుకూలమైన ఈ స్మార్ట్ మీటర్లను ముందుకు తీసుకొచ్చారన్నారు. తెచ్చారన్నారు. గత ప్రభుత్వ హాయంలో ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు, లోకేష్, పవన్ కల్యాణ్‌లు స్మార్ట్ మీటర్లను బద్దలు కొట్టాలని పిలుపు నిచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి అదే విధానాన్ని అమలు చేయడం సిగ్గుచేటన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజల నెత్తిన చార్జీల భారం మోపేందుకు కంకణం కట్టుకుందన్నారు. ప్రజలే ఈ దుర్మార్గ నిర్ణయాలను తిప్పికొట్టాలని వారికి సీపీఎం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి కె.వెంకటేశ్వరరావు, నాయకులు పి.నాగరాజు, టి.రత్తయ్య, మానుకొండ వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు అధ్వాన రహదారికి మోక్షం


రహదారి పనులు ప్రారంభించిన సిబ్బంది

ఉంగుటూరు: ఉంగుటూరు నుంచి నారాయణపురానికి ఉన్న మండల పరిషత్ రహదారికి ఎట్టకేలకు నిధులు మంజూరు చేశారు. కోటి పది లక్షలు రూపాయలు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు మంజూరు చేశారు. రహదారి పనులకు ఎమ్మెల్యే ధర్మరాజు భూమి పూజ చేశారు. ఈ నేపథ్యంలో జేసీబీ సాయంతో తొలి దశలో ఎర్త్ వర్క్ పనులు నిర్వహిస్తున్నారు. గ్రావెల్, మెటల్‌తో రహదారి నిర్మిస్తారు. రహదారి పనులు పర్యవేక్షిస్తున్న పంచాయతీరాజ్ ఏఈ కృష్ణమోహన్ మాట్లాడుతూ రోడ్డును నాణ్యతతో నిర్మిస్తామని తెలిపారు. ఈ రహదారి నిర్మిస్తే తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలతో పాటు ఐస్ ఫ్యాక్టరీలకు వెళ్లే కార్మికులకు దగ్గరి మార్గం ఏర్పడుతుంది. ఇదొక ప్రధాన రహదారి కాబోతోంది.

పట్టపగలే విద్యుత్ కాంతులు


పూళ్లలో పట్ట పగలే వెలుగుతున్న వీధి లైట్లు

భీమడోలు: పట్టపగలే విద్యుత్ కాంతులు వెదజల్లుతున్నాయి. సూర్యుని వెలుతురుతో పోటీ పడుతున్నాయి. అప్రకటిత విద్యుత్ కోతతో ప్రజలు ఇబ్బందులు పడుతుండగా కొన్ని గ్రామాల్లో పంచాయతీ వీధి లైట్లు పగలే కాంతులను వెదజల్లుతున్నాయి. కొన్ని చోట్ల సాంకేతిక కారణాలతో వీధి లైట్లు వెలగడం లేదు. వాటికి సిబ్బంది కనీస మరమ్మతులు చేపట్టడం లేదు. పూళ్ల పంచాయతీ మెయిలన్ రోడ్డు వెంబడి వేసిన విద్యుత్ వీధి దీపాలు మంగళవారం మధ్యాహ్నం వెలుగుతూనే ఉన్నాయి. కనీసం ఉదయాన్నే స్విచ్ఛాఫ్ చేయాలన్న ఆలోచన లేకపోవడం శోచనీయం. ఇలా విద్యుత్ వృథా అవుతుంది. ఇకనైనా సంబంధిత విద్యుత్, పంచాయతీ అధికారులు ప్రత్యేక శ్రద్ధను చూపి విద్యుత్ వృథా చేయకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

13న ఏలూరు మండల సర్వసభ్య సమావేశం

దెందులూరు: ఏలూరు మండల సర్వసభ్య సమావేశం ఈనెల 13న ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ సూర్యనారాయణ రాజు అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వి.శ్రీలత తెలిపారు. ఎంపీటీసీలు అన్ని శాఖల అధికారులు విధిగా సమావేశానికి హాజరుకావాలని కోరారు.

క్లుప్తంగా

నిరసన శాంతియుతంగా ఉండాలి


కామిరెడ్డి నాని

దెందులూరు: ఏదైనా అభ్యంతర విషయాలు ఉంటే నిరసన శాంతియుతంగా చేయాలే తప్ప పత్రిక కార్యాలయాలకు వెళ్లి తగలబెట్టడం మంచి సంప్రదాయం కాదని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు కామిరెడ్డి నాని ఖండించారు. మంగళవారం ఆయన సాక్షితో మాట్లాడుతూ టీవీ డిబేట్‌లో పాల్గొన్న వారు చెప్పింది ఆ ఛానల్‌కు, యాజమాన్యానికి ఆపాదించడం ఏ మాత్రం తగదన్నారు. రాజకీయ పార్టీలు ఏ కార్యక్రమం చేసినా హుందాగా ఉండాలన్నారు. రాజకీయాలు భావితరాలకు ఆదర్శప్రాయంగా నిలవాలే తప్ప ఈ తరహాలో పత్రికా కార్యాలయాలపై దాడులు చేయడం హర్షించదగ్గ విషయం కాదన్నారు. అధికారం ఏ ఒక్కరికీ శాశ్వతం కాదని భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని రాజకీయ పార్టీలు పాలన సాగించాలని కామారెడ్డి నాని అన్నారు.

రహదారి ప్రమాదాల నివారణకు చర్యలు


జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్న ఎస్సై కట్టా శారదా సతీష్

పెదపాడు: జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పెదపాడు మండలంలోని కలపర్రు జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పెదపాడు ఎస్సై కట్టా శారదా సతీష్ తెలిపారు. పెదపాడు మండలంలోని కలపర్రు గ్రామంలో ఏలూరు పోలీసు కంట్రోల్ రూం సీఐ అఖిల్ జామా ఆధ్వర్యంలో ఎస్సై కట్టా శారద సతీష్, డీటీఆర్‌బీ మధు, రోడ్డు సేఫ్టీ సిబ్బందితో కలిసి తాతీయ రహదారిపై తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో పెదపాడు పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ రహదారి వెంబడి తిరిగి ఆక్రమణలు


జాతీయ రహదారి వెంబడి వెలసిన ఆక్రమణలు

ఉంగుటూరు: జాతీయ రహదారి వెంబడి ఆక్రమణలు తిరిగి వేస్తున్నారు. ఎంతో కాలంగా ఉన్న ఆక్రమణల ఒక వ్యక్తి హైకోర్టు లోకాయుక్తలో వేసిన కేసు ఫలితంగా తొలగించారు. ఉంగుటూరు, నారాయణపురం, కైకరం చేబ్రోలు గ్రామాలలో ఈ ఆక్రమణలను తొలగించారు. యంత్రాంగం ఆక్రమణలు తొలగించే పక్రియలో నిమగ్నమై పని చేశారు. ఆక్రమణలు తొలగించి ఎంతో కాలం కాలేదు. తిరిగి కాలువ గట్లు ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్నారు.

గాలాయగూడెం విద్యార్థికి షైనింగ్ స్టార్ అవార్డు


విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

దెందులూరు: గంగన్నగూడెం శ్రీసాయి హైస్కూల్ విద్యార్థి గాలాయగూడెం గ్రామానికి చెందిన పి.మణికంఠ షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికై రూ.20 వేల నగదును అందుకున్నాడని పాఠశాల కరస్పాండెంట్ బి.వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

మహిళల భద్రత, ర్యాగింగ్‌పై అవగాహన

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని ప్రైవేటు కళాశాలలో విద్యార్థులకు మహిళల భద్రత, సైబర్ క్రైమ్, డ్రగ్స్, ర్యాగింగ్ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం సుబ్బారావు, మహిళా ఎస్సై కాంతి ప్రియ మాట్లాడుతూ ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో మహిళలు వెంటనే 112 లేదా 7993485111 (శక్తి) నెంబర్‌కు కాల్ చేయవచ్చని అన్నారు. ఈ నెంబర్ ద్వారా తక్షణ సాయం అందుబాటులో ఉంటుందని, శక్తి యాప్‌ను ప్రతి మహిళా తన మొబైల్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఈ యాప్ ద్వారా అత్యవసర సమయంలో ఒకే క్లిక్‌తో సహాయం కోరవచ్చన్నారు. విమెన్ డ్రాప్ వాహనం మన జిల్లాలో రాత్రి 10 నుంచి ఉదయం 5 గంటల వరకు మహిళలకు హోమ్ డ్రాప్ వాహన సేవ అందుబాటులో ఉందని తెలిపారు. రాత్రి సమయంలో ఎవరైనా ఒంటరి మహిళలు సురక్షితంగా ఇంటికి చేరేందుకు ఈ వాహనాన్ని వినియోగించుకోవచ్చని సూచించారు. కళాశాలలో ర్యాగింగ్ పూర్తిగా నిషేధమని, ర్యాగింగ్ చేస్తే కఠినమైన శిక్షలు విధించబడతాయని హెచ్చరించారు. అటువంటి చర్యలకు యువత దూరంగా ఉండాలన్నారు.